
కథ

# ఒక్కవాన చాలు



- నన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి

రాత్రి పదిగంటలు దాటినా మా యవ్వారం ఆగలేదు. ఏవేవో లోకాభి రామాయణాలు దొర్లుతున్నాయి. చెత్త కథలు పురివిప్పుకొంటున్నాయి. డ్రామా పద్యాలు గొంతు సవరించు కొంటున్నాయి.

కొందరు కూర్చుని ఉన్నారు. ఇంకొందరు పడుకొని ఉన్నారు. అర్ధగంటకోసారి ఎవరో లేచి టార్చి లైటు వెలుగును చుట్టూ చేలకేసి నిశితంగా ప్రసరింపజేస్తూ గుడ్డిగా కేకలేస్తున్నారు.

వాళ్ళ కేకలు అందుకొని దూరపు చేలల్లోంచి తిరిగి కేకలు వినిపిస్తున్నాయి. తలకింద చేతులుంచుకొని వెల్లకిలా పడుకొని పైకిచూస్తున్నాను నేను. ఎండిపోయిగవ్వలు బైటపడ్డచెరువులా ఉంది ఆకాశం.

ఉత్తర కార్తె దాటి పోతోంది. వారం రోజుల్నించి తూర్పు గాలులు కూడా మొదలయ్యాయి. ఒక్క మేఘపు తునక ఆకాశంలోకి రాలేదు.

పైర్లు వాడుతున్నాయి.

"ఒక్క వాన కురిస్తే ఎంత బావుండు!" మనస్సులో అనుకోబోయి పైకి అనేశాను. అక్కడతో అక్కడ నిశ్శబ్దం అలముకుంది. అందరి మనస్సులూ గతి తప్పినట్లున్నాయి.

"చారెడు మబ్బు తునకన్నా లేకుండా నుక్కలట్టా ఇరగబడి కాస్పాంటే వానెట్టొస్పది?" గురవ్పడు అన్నాడు.

"దాన్దేముంది. దేవుడు కన్ను దెర్సాలగాని పిడికెడు మబ్బెంతసేపొస్పది! వంకలు, వాగులు సెరువుల్దొరువులు ఏకం కాడానికి ఎంత సేపు పడ్తది!" ఆచారి అందుకొన్నాడు.

"ఒక్క వానొస్తే చాలు – ముక్కాలు వంట దక్కినట్టే" రమణ అంటున్నాడు.

"పదిరోజులట్నే ఉంటే గుంటికలు కట్టాల." కృష్ణ గొంతు బాధతో నుడులు దిరిగింది.

"వానొస్పదెన్నా! కాయంగా వస్పది" మూగెన్న అన్నారు.

"అదే .... అట్టా నూడండ్రి," వేలెత్తి చూపాడు.

అందరి చూపులూ అటుకేసి తిరిగాయి.

అప్పుడే కొండల్లోంచి చందమామ వెన్నెల నవ్వుల్తో బైటకొచ్చేందుకు ప్రయత్నిస్తోంది. ఆ వెలుగుల్ని అడ్డుకుంటూ ఒక దువ్పటి పొడవున్న నల్లటి మేఘపు తునక ... కొండల వెనక నించి మేఘాల మంద ఉనికిని తెలుపుతూ, తళుక్కుమనే మెరుపు ... వెనకే ఉరుము.

"ఉత్తర కార్తెలో ఉరుములే కాయంగా వానొస్పదెన్నా!" అనుభవ జ్ఞానాన్ని మాముందు పరుస్తున్నాడు మూగెన్న.

నా మనస్సులో ఏమూలనించో ఆనంద తరంగం ఆశల నురువుతో తీరం కేసి పరువెత్తు కొస్తోంది..... కమ్మని వార్త అది.

మాలో మూగెన్న ఒక్కడే వృద్ధుడు. మిగిలిన వాళ్ళమంతా ముప్పైఏళ్ళ లోపు యువకులమే, రోజూ రాత్రి ఏడుగంటల కల్లా మాచేనికి దక్షిణపు వైపు వంక గట్టుమీద ఇట్లా నమావేశమవటం, నిద్రొచ్చేదాకా మాట్లాడుతూ గడవటం మామూలైంది. మరో అర్ధగంటకు ఒకరొకరూ లేచి తమ చేలకేసి సాగారు.

ఈటె కట్టె నేలమీద పొడున్తూ, చేలోని మంచెవద్దకు చేరుకొన్నాను నేను. చాలా మంది గుడిన లేనుకున్నారు. గుడిసెల్లేని నాలాంటి వాళ్ళం మంచెలేనుకొని ప్లాస్టిక్ పేవరు గూడలు వెంట తెచ్చుకొంటున్నాము.

కరవుకు తోడు అడవి వందుల పోరుఎక్కువైంది. ఏమారితే చాలు చేనంతా దున్ని పారేస్తున్నాయి.

మంచెమీద వడుకొని తూర్పు దిశకేసి చూస్తున్నాను.

మూగెన్న రేపిన ఆశ నాలో పెరుగుతున్నంత వేగంగా అక్కడ మేఘం వృద్ధి కాలేదు. నగం రాత్రికయినా తన నడక వేగాన్ని పెంచుకొని అది మాచేలమీద వర్షిస్తూ వయనిస్తుందనే నమ్ముతున్నాను.

అప్పుడప్పుడూ వంది పిల్లలా గుర్రు గుర్రు మంటున్న మేఘాన్ని ప్రేమగా చూస్తూ నిద్రలోకి జారుకొన్నాను.

రాత్రి ఒంటిగంట ప్రాంతంలో ఉలికి పాటుగా మెలకువ వచ్చింది. ఆదరా బాదరా లేచి టార్చిలైటు వెలుగును చేనంతా తిప్పాను. తలపైకెత్తేనరికి ఆకాశంలోకి రెండు బారల పైకెక్కి విశాలంగా విస్తరించుకొంటోన్న మేఘం కన్పించింది. అప్పుడు అర్ధమైంది – అది వంది అరుపు కాదని ఉరుమని.

మేఘాన్ని ఆప్యాయంగా చూస్తూ మళ్ళీ నిద్రలోకి జారుకున్నాను.

ఎంతసేపు నిద్రపోయానో తెలీదు. మళ్ళీ అదే అరుపు చెవి గూబను తడుతూ మెలకువ వచ్చింది గాని కళ్ళు తెరవబుద్ధి కాలేదు. మేఘం నడిమింటికి వచ్చుంటుంది. అందరికీ జాగ్రత్తలు చెబుతోంది కాబోలు నగం తడిసే దాకా నేను గూడ కప్పుకోదల్చుకోలేదు. నా శరీరం వాన చినుకు స్పర్శకోసం అర్రులు చాస్తోంది.

దీపావళి కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ

తిరిగి అదే శబ్దం – రెండు మఘాడు మేఘాలు నంభాషించుకొంటున్నట్లుగా. నాకనుమాన మొచ్చింది.

శబ్దం పైనించి కాదు. చేలోంచే.

గబుక్కున కళ్ళు తెరిచాను.

ఆకాశం నిర్మలంగా ఉంది. ఒక్క మేఘపు తునక కూడా లేదు. ఇంద్రజాలం చేసినట్లు మాయమై వుంది.

అంటే ..... ఆ అరుపు.....?

టార్చి అందుకొంటూనే చివుక్కున లేచి కూచుని వంకవైపుగా చేలోకి వెలుతురు గుప్పించాను.

నల్లటి గుండ్రాళ్ళు పేర్చినట్లుగా వందుల మంద.

అప్రయత్నంగానే నా నోటినుంచి నరాలన్నీ తెగిపోయేలా ఒక పొలికేక విచ్చుకొచ్చింది. పక్కనున్న ఈటెను అందుకొని మంచెకొయ్యలకేసి బలంగా బాదుతూ కేకలేయ సాగాను.

నాకేకలందుకొని పక్క చేలల్లోని వ్యక్తులంతా గొంతు చించుకొని ప్రతిగా కేకలేయటం మొదలెట్టారు. బాగా అలవాటు పడ్డాయి కాబట్టి వందులు బెదరలేదు.

ఈటె కట్టెతో నహా గుభిల్లున కిందకు దుకాను నేను.

వందులకు ఎదురుగా వెళ్ళటం దుస్సాహనమే అవుతుంది. మూర్ఖంగా మనిషి మీదకు వచ్చి ముట్టెతో పడగొడతాయి అవి.

జరుగుతోన్న వంట నష్టం ముందు అదంతా స్ఫురించలేదు. ఈటె పైకెత్తి వాటికేసి గురిజేస్తూ చావుకేకలేస్తూ ముందుకు దూసుకెళ్ళ సాగాను.

నా మిత్రులంతా ఇటుకేసే పరుగెత్తుకొస్తున్నట్లు వాళ్ళ కేకల వల్ల తెలుస్తోంది. ఎవరో వటాకాయ కాల్చినట్లున్నారు పెద్ద శబ్దమైంది.

ఇంత గొప్ప యుద్ధ వాతావరణం సృష్టించటం మూలంగా నేను వాటిమీద ఈటె ప్రయోగించే లోపలే వందులు బెదరి వంకలోకి దూకాయి.

తర్వాత అవి మరెవరికీ అందలేదు.

ఇక తెల్లార్లూ నిద్ర రాలేదు. ఒకని కేక మరొకడు అందుకొంటూ కోళ్ళు కూసే దాకా ఆ వరినరాల్ని నిద్రపోనీలేదు.

తెల్లారు ఝామున ఇంటికెల్తుంటే ముందు నడుస్తోన్న మోహన్ వద్ద ఏదో వస్తువు లోపించినట్లుగా అనిపించింది. పరిశీలించి అడిగాను "గొడుగు తెచ్చుకోలేదేమని?"

ఒక చేతిలో ఏదో ఒక ఆయుధం, మరో చేతిలో టార్చి, భుజాన దుప్పటి, కాళ్ళకు చెప్పులతో పాటు గొడుగో, ప్లాస్టిక్ గూడో వెంట తెచ్చుకోవడం అలవాటు.

మోహన్ నవ్వాడు. "వానొచ్చేదాకా తెచ్చుకోగూడదనుకొన్నే మామా! తడ్సాలనిపిస్తోంది. నానినాని వొనికిపోవాలనిపిస్పొంది. అప్పడ్దాకా చెత్రి తెచ్చుకోనేదే లేదు" చెప్పాడు.

నాకు గుండెల్లో ఎక్కడో చెమ్మగిల్లినట్లుగా అనిపించింది.

"వాన కచ్చితంగా రావాలి వస్తుంది – ఇప్పుడే కాకున్నా కార్తె నంధిలోనైనా'

మధ్యాహ్నం మానాన్న కూడా అదే చెప్పాడు.

రాత్రి ఏడు గంటలకు వాతావరణ నూచనలో రాయలసీమకు అక్కడక్కడా వానయోగమున్నట్లు ఆకాశవాణి చెప్పింది.

మనస్సులో తృప్తిగా వుంది.

ఈ యేడు మంచి అదనులో పదనవటం వల్ల వది రోజులు ముందే విత్తనం వడింది. పైరు జుట్టువట్టి పీకినట్లుగా ఎదిగొచ్చింది.

ఇప్పుడొక్క వాన కురిస్తే చాలు.

★ ★ ★

ఉరిమి ఉరిమి ఉత్తర కార్తె దాటింది. హస్తలో నగం జరిగింది. వాన ఒంగలేదు. పైరంతా కొనలు కొనలు ఎండిపోయింది. భూమిలోకి చొచ్చుకుపోయిన ఊడలు పిందెలయి ఎదగాల్సిన వరువంలో, పువ్వవతులయి మూలన ఒద్దికగా కూచోవాల్సిన తరుణంలో చుట్టూ మట్టి పొత్తిళ్ళు మాడిపోయాయి. వాటి బతుకు ఇగిరిపోయింది.

చెరువు తెగిపోకుంటే ఇంత బాధలుండేటివి కావు. చెరువుకింద వరి వండకున్నా వేరుశెనగకు ఒక తడి అందేది. తెగిన చెరువుకట్ట రాజకీయ శిఖండుల స్వార్ధపు 'ముష్టి' యుద్ధాల మధ్య మరమ్మతులకు నోచుకోలేక నర్కారు తుమ్మకంపను ఒంటినిండా పెంచుకొంటోంది.

ఉదయం పోరుమామిళ్ళ వెళ్లినప్పుడు మా ఫ్రెండొకడు తటస్థ పడ్డాడు. కోస్తా ఏరియాలో అగ్రికల్చరల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. ఈ ఏరియాలో వేరుశెనగకు బాగాతెగులున్నట్లుంది" అన్నాడు.

ప్రశ్నార్థకంగా అతనికేసి చూశాను.

"దగ్గర కెళ్ళి పరిశీలించలేదు గాని బస్సులోంచి గమనిస్తే.. ఆకుల మీద పొడలుపొడలుగా మచ్చలు.. తిక్కా తెగులున్నట్లుంది.. భూమిలో జింకు ధాతులోపమున్నట్లుంది.. " ఇంకా ఏదో చెప్పబోతూండగా ఫక్కున నవ్వాను నేను.

ఆశ్చర్యంగా నాకేసి చూశాడు.

"అన్నితెగుళ్ళను మింగే పెద్ద తెగులుంది. దాన్ని గమనించలేదా?" అడిగాను.

"అంటే..?"

"కరవు."

తర్వాత ఈ ప్రాంత పరిస్థితిని గురించి చాలాసేపు మాట్లాడుకొన్నాము. వందుల కావలి గుర్తొచ్చి పెందలా

రే ఇంటికి చేరుకొన్నాను. రోజులు గడిచిపోతున్నాయి.

ఎండిపోతోన్న పైరు రోజు రోజుకి నాగుండెల్లో వేదనని పెంచుతోంది. అప్పు రూపంలో వచ్చిన పెట్టుబడి వడ్డీల కందలు పెంచుకొని నా తలమీద తన వామన పాదాన్ని మోపుతోన్నట్లుగా అన్పిస్తోంది.

ఉద్యోగపు వేటలో ఓడిపోయి సర్టిఫికెట్ల అస్త్ర శస్త్రాల్ని మూలన విసరి కుల వృత్తితో నన్నా కడుపు నింపుకొందామని చేసిన నా ప్రయత్నం వల్ల నాకు నమ్మకం నన్నుగిల్లుతోంది.

"వాన ఖాయంగా వస్తది నాయినా! కొత్త సేద్యగాల్లయి మీరు భయపడ్తాండ్రుగాని వానరాకుంటే పైర్లుఎట్లన్నాయె మనుసులు బతుకతరా?" మానాన్న ధైర్యం చెబుతూనేఉన్నారు.

సాయంత్రం మా ఇంటి ముందు అరుగుమీద కూచుని ఉన్న అంబారవు సుబ్బులు వద్ద కెళ్లాను - "తాతా! వానొస్తదంటవా?" అని.

ఆయన ఆకాశం కేసి చాలాసేపు పరిశీలించి చూసి "వస్తదోయ్!" అన్నాడు.

"నిన్న మొన్న గూడా సూసినా. తూరుపుక్క జలరేకలు తీర్సిన్నెయ్. ఖాయంగా రొండు ముత్రోజుల్లో రావాల" చెప్పాడు సున్నం నోట వేసికొంటూ.

హస్తకార్తె దాటుతోంది.

"ఇప్పుడయినా ఒక్క పదనయితే బావుండు. నగం పంటన్నా దక్కుద్ది"

* * *

ఆకాశంలో ఆశల గుడ్లను పొదగటం తప్ప అవి పిగలటం లేదు. మబ్బుల పక్షులై ఆకాశమంతా రెక్కలు విప్పలేదు. గొంతు విప్పి చినుకుగీతాల్ని పాడటం లేదు.

వగుళ్లు ఎండా కాలాన్ని మరిపిస్తున్నాయి.

చిత్తకార్తెలో కనీసం చిత్రమోదయినా పడుతుందేమోనని గగనం కేసి మోరలెత్తి అదేపనిగా చూస్తున్నాము.

ఏ గుంటల్లో చూసినా కువ్వతెప్పలుగా చేపలుండే సమయం. ప్రతిచేపా తనలో నగం పరిమాణమున్న గుడ్లను కడుపునిండా మోస్తూ, సొద్దరొట్టెల్లోకికూరొండుకొంటే బహు పసందుగా ఉండే కాలం.

ఎక్కడా నీటి చుక్క లేదు.

ఎవరి పెరట్లోంచి చేపలు తోమిన నీచువానన గమ్మున మొహాన కొట్టటం లేదు.

వేరుశెనగ దాదాపు ఎండిపోవచ్చింది. చెట్టుకు ఒకటి రెండు కంటె ఎక్కువ కాయల్లేవు.

మధ్యాహ్నం మా కళ్లం వద్ద చింతచెట్టుకింద కూచుని ఉన్నసుబ్బులు తాత వద్దకెళ్లి "ఇంకా వానొస్తదంటవా తాతా?" అడిగాను.

"కూకో. సెబ్తా." అన్నాడు నా కేసి ఎగాదిగా చూసి.

ఎదురుగా కూచున్నాను. మరో నలుగురు వచ్చి చేరారు.

"ఒరే అబ్బీ! బీడీ ముక్క యియ్యరా" పిచ్చన్నకేసి చూస్తూ అడిగాడు తాత. పిచ్చన్న అందించగానే కాల్చి పొగ వదల్తూ చిన్న సుద్దపేలికను ఏరి చేతికి తీసికొన్నాడు. ఓ వైపు ఎంగిలితో తేమజేస్తూ "ఇది వచ్చి" అన్నాడు. తేమ లేని వైపు చూపి "ఇది వొత్తి" చెప్పాడు.

"కొరుకో! వచ్చే? వత్తే?" నాకేసి చూస్తూ అడిగాడు.

"వచ్చి." చెప్పాను. కుతూహలంగా ఉంది నాకు.

సుద్ద పేలికను పైకెగరేశాడు.

కింద పడగానేదానికేసి చూశాము.

## దొంగల బాధ

ఇద్దరు దొంగలు ఒక బ్యాంకును దోచుకుని ఇల్లు చేరారు. బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటున్న రెండో దొంగతో, "ఎంతో లెక్క పెడదామా!" అన్నాడు మొదటి దొంగ.

"అవసరం లేదు. రేపొద్దున్న పేపర్లో చూసి తెలుసుకోవచ్చు!" అన్నారు రెండో దొంగ!

'మాలిక్' [కందుకూరు]



"వచ్చి – వాన ఖాయంగా వస్తది." చెప్పాడు సుబ్బులు తాత.

తర్వాత గులకరాళ్లు ఏరి పిడికెడుతో పట్టుకొచ్చి సరిబేసి చెప్పమన్నారు. అందులో కూడా నాకనుకూలంగానే వచ్చింది ఫలితం.

ఏదో తృప్తిగా ఉంది.

వానొస్తుందని భావించుకోవటంలో అందమైన ఆనందం లోలోపల రగులుతోంది.

చేలవద్ద కెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు ఎదురైన ప్రతి మనిషిని అవసరమున్నా లేకున్నా పలుకరిస్తున్నాను. వానను గురించి మాట్లాడుతున్నాను. అతని బాధలో భాగం పంచుకోవటం గుండా నా బాధను తగ్గించుకొంటున్నాను. వానమీద అతను గుప్పించే ఆశలకురెక్కలు తొడిగి మబ్బుల్లోకి ఎగరేసి చప్పట్లు కొడుతూ ఆనందిస్తున్నాను.

"వానేద వస్తది? యియ్యేడంతా కరువే. పెట్టుబడి గూడా రాదు" దారిలో ఎదురైన జయన్న అనటంతో అతనిమీద కోపమొచ్చింది. అపశకునాలు పలుకుతున్నాడనిపించింది.

ఎవరైనా సరే వానరాదని చెబితే నాకు బాధగా



"నిన్న రాత్రి ఆటంటికి వెళ్లి, ఇప్పుడు రావడంలో మీ ఉద్దేశ్య మేమిటీ?" కోపంగా అడిగింది భార్య సరోజ మధ్యాహ్నం పన్నెండు గంటలకొచ్చిన భర్తను.

"భోజనం చేద్దామని!" కూల్‌గా చెప్పాడు భర్త పేకాట పాపారావు.

శ్రీకొండ [ఎర్రబోడు]

అన్పిస్తోంది. గుండెలు గుభేలు మంటున్నాయి. పాములు ఖాళీ అయి, మేపేందుకు గడ్డిలేక మొన్న రోశయ్య ఎద్దుల్ని అమ్మితే - విషయం తెలిసి అంగడి బాకి తీర్చమని ఇంటివద్ద కూచున్న వ్యాపారే గుర్తుకొస్తున్నాడు. శెనక్కాయ పీకింతర్వాత ఇస్తానని రోశయ్య ఎంత మొత్తుకొన్నా ససేమిరా ఒప్పుకోలేదు. "శెనక్కాయలు ఇత్తనాలు కూడా కావు.దాన్లో ఏముస్తది! ఆ వచ్చేదేదో నువ్వే ఉంచుకో. ఎద్దులెక్కలో నా బాకీ తెంచు" అంటూ వాకిట్లో తిష్ట వేసుక్కూచుని నానాగడ చేశాడు.

నా పరిస్థితీ అలాగే ఉంటుందేమో రేపు! మొన్నటి దాకా ఎంత అప్పుకావాలన్నా ఇచ్చే వ్యాపారి ఈ రోజు మొహం చాటేస్తున్నాడు. రేపు నిలేసేందుకు కూడా వెనుకాడడు.

వెన్నులోంచి చలి పుట్టుకొస్తోంది ఆ విషయం అనుకొన్నపుడంతా.

మా మేనల్లుడు కేశవ ఊర్నించి వచ్చాడు. రాత్రి చేని వద్దకు నా బదులు తను కావలి వెళ్ళాడు.

నాకెంతో స్వేచ్ఛగా అన్పించింది.

రాత్రి వాతావరణంలో ఏదో మార్పు కన్పించింది.

"వానొచ్చేట్టుంది. మంచమింట్లో యేసుకో." ఇందిర చెప్పింది.

నేను పలుక లేదు. నిశ్శబ్దంగా మేఘాల్నే చూస్తున్నాను.

"వాన రావాలి గాని తడిస్తే మాత్రమేమిటి? నన్ను తడిపేందుకే వానొచ్చేటట్లుంటే నేను సిద్ధం... వానా... ఓ వానదేవుడా? ...రా.. నన్ను తడుపు... నీకు సత్తావుంటే నన్ను తడిపి తడిపి నానేసి మొలకెత్తేట్లు చేయి... మగాడివైతే రా?..." మనస్సు ఏదేదో పలవరిస్తోంది.

మనస్సులో భావాలన్నిటికీ నోరొస్తే ప్రతి మనిషీ పిచ్చివాడేమో?

ఎక్కడినుంచో చల్లటి వానగాలి వచ్చి తాకుతోంది ఇందిర మాటల్లాగే.

నాకు తెలీకుండానే నిద్రపట్టింది.

సగం రేత్రికి ఆమె అనుమానాన్ని నిజం చేస్తూ టపటప చినుకులు మొదలైనాయి. కళ్ళు తెరిచాను. కప్పుకున్న దుప్పటి తీసి తలకింద పెట్టుకొని వెల్లకిలా




పడుకొన్నాను. నా శరీరమంతా చినుకుల స్పర్శకు పులకరించిపోతోంది.

ఆ ఆనందాన్ని అనుభవించటంలో పరవశించి పోతున్నాను.

ఇందిర చెబుతోంది "వానెక్కువయిద్ది. మంచం లోప లేసుకొమ్మ"ని.

చాలా మధురంగా విన్పిస్తున్నాయి ఆ మాటలు చెవులకు.

మరీ మరీ వినాలనిపిస్తోంది.

కొద్ది సేపటికి చినుకుల సందడి ఎక్కువైంది. నేను పూర్తిగా తడిశాను. మహా ఉత్సాహంతో లేచి మంచం ఇంట్లో వేసికొన్నాను. వాకిట్లోకి లాక్కుని కాళ్ళు వేలాడేసి కూచుని చాలాసేపు వాననే గమనిస్తూండి పోయాను.

వాన బలపడలేదు. మనిషిని తడిపే వానేగాని మట్టిని తడిపే వానగాదు. మేఘాలు మాత్రం క్షణక్షణానికి బలపడి పోతూ ఆకాశాన్ని పూర్తిగా కప్పి కన్ను పొడుచుకున్నా కానరాని చీకట్లను లోకానికి మిగుల్చుతున్నాయి.

వాకిట్లోకి తలపెట్టుకొని చినుకుల చిటపట శబ్దం తన్మయంగా వింటూ పడుకొన్నాను. తెల్లారేసరికి విజృంభించి కుంభవృష్టి కురుస్తుందనీ, వెలిపిరి కొట్టి నన్ను తడిపి లేపుతుందనీ భావిస్తూ ఆ దృశ్యాల్ని కళ్ళముందు ప్రత్యక్షం చేసికొంటూనే నిద్రలోకి జారుకొన్నాను.

తెల్లారి చూస్తే ఎక్కడా గోదురుకప్పల అరుపులు విన్పించలేదు.

వీధుల్నిండా ఎర్రనీరు కనిపించలేదు.

నా చూపుల్ని గమనించి "కల్లేపి చల్లిన మాత్రం కురిసిపొయ్యింది." చెప్పింది ఇందిర.

నా కలలన్నీ కల్లలయ్యాయి.

"చేని పక్క వాన మెండా?" అప్పుడే ఇంట్లోకి వస్తోన్న కేశవను అడిగాను.

"ఇక్కడే మేలు" చెప్పాడు వాడు. "రెండు మూడు రోజులు చూసి గుంటక తోలడం మేలు."

వేరుశెనగ దాదాపు పూర్తిగా ఎండిపోయింది. దానికేసి చూసేందుకు కూడా మనస్కరించక పగలు చేనికేసి వెళ్ళటం లేదు.

నాకింకా ఆశ చావలేదు

మేఘాలు కళ్ళు తెరచి కనికరాన్ని రాలుస్తాయనే అనిపిస్తోంది.

మధ్యాహ్నం రెండు గంటలకు, రాత్రి ఏడు గంటలకు రేడియో ముందు విధిగా కూచుని వాతావరణ సూచనలు వింటున్నాను. సుబ్బులు తాత లెక్కగట్టే జలరేఖల్ని గమనిస్తున్నాను. మునలి రైతులు చెప్పే ఆశావహ ప్రతీకల్ని నమ్ముతూనే ఉన్నాను.

"ఒక్క వాన కురిస్తే ఎంత బావుండు?" అనుకొంటూ ఆకాశం కేసి చూస్తూనే ఉన్నాను.

ఎదురైన వాడినంతా అడుగుతున్నాను "కనీసం విత్తనాలయినా దక్కుతాయా?" అని.

"విత్తనాలేం? శెనక్కాట్టె అమ్ముకొంటే పెట్టుబడిగూడా వస్తుది." చెబుతున్నారు కొందరు.

ఆశగా ఉంది. గుండె దిటవు పడుతోంది.

'వాన రాకుండా పోతుందా?' అనే ధైర్యం ఇంకా జారలేదు. 'ఉదయమొస్తుంది, సాయంత్రమొస్తుంది. రాత్రికి తప్పకుండా వస్తుం'దని ఎదురు చూస్తున్నాను.

ఒక్కోసారి అనుమానమొస్తుంది 'నిజంగా వానొస్తదా?' అని.

అంతలోనే సర్దిచెప్పుకొంటాను మనస్సుకు. నా అనుమానాన్ని కోపంగా చూసి చెంపదెబ్బ వేస్తాను.



"పెళ్లయిన స్త్రీలు భర్త అడుగు జాడల్లో నడవాలి, తెలిసిందా!" అన్నది తల్లి మంగతాయారు కాపురానికి పంపుతున్న కూతురు రోహిణితో.

"అదెలా కుదురుతుందమ్మా! ఆయన పోస్ట్‌మాన్ కదా!" అన్నది కూతురు.

శ్రీకొండ [ఎర్రబోడు]

ఒక సాయంత్రం రాజన్న అడిగాడు మొహం వేలాడేసుకొని "ఇంగేం వానొస్తుదెన్నా?" అని.

"ఖచ్చితంగా వానొస్తదబ్బీ" చెప్పాను. మనస్సులో ఓ మూల అనుమానం పెరిగి వస్తోంది-'రాదేమో'నని. అలా అని వాడికి చెప్పేందుకు నాకిష్టంగా లేదు. వాణ్ణి నిరాశపరచి దిగులు పడేట్లు చేయటం నాకు నచ్చలేదు.

హఠాత్తుగా నాకో అనుమానమొచ్చింది. 'నాలాంటి భావమే మా నాన్న అంబవరం సుబ్బులు లాంటి ముసలాళ్ళకు కూడా ఉండి ఉంటుందేమో?'

నేను నిరాశ పడకుండా ధైర్యం చెబుతున్నారేమో? ఏదో జ్ఞాన నేత్రం తెరచుకొన్నట్లుగా అన్పించింది.

×× ×× ××

రాత్రి చేలో మంచె మీద పడుకోబోయే ముందు ఈశాన్య మూలగా చిన్న చేటంత మబ్బు తునక కన్పించింది.

నిర్లక్ష్యంగా చూస్తూ కళ్ళు మూసికొన్నాను.

నగం రేత్రికంతా ఏదో కమ్మని వాసనతో కూడిన చల్లని గాలి శరీరానికి సోకి కళ్ళు తెరిచాను.

చిటపట శబ్దం చేసికొంటూ తూర్పువైపు నించి శరవేగంగా దూసుకొస్తోంది. వెనకే గాలి. దాని వెనక ఉరుములు మెరుపులు. ప్లాస్టిక్ పేపర్ 'గూడ' పైకి లాక్కునే సరికే వచ్చి మీదబడింది వాన. ఊపిరి సలపని వాన. తెల్లార్లూ తప్పెట్ల మోతను ఒంటికి అంటించిన వాన.

ఉదయం లేచి, తడిసిన పక్షుల్లా గొడుగుల కిందా గూడల కిందా ముడుచుక పోయి ఊర్లోకి చేరుకొన్నాము.

సాయంత్రం దాకా వాన తగ్గలేదు. వాగులు వంకలు ఏకమైనాయి. రాత్రి కూడా విరమించుకోలేదు. అంతలో 'బంగాళాఖాతంలో వాయుగుండం' అంటూ రేడియో మొత్తుకోవటం, ఋతుపవనాలు అధికం కావటం వెరసి వారం రోజులు మింటికి మంటికి ఏకధారగా వాన కురిసింది.

ఏమారి ఉండటం వల్ల పొయ్యిలోకి కట్టెలు కూడా కరవై కొట్టం వాసాలు ఊడలాగాల్సిన దుస్థితి వచ్చింది. పాత మిద్దెలు బుంగలు పడి కుండలు సెరవలు ఇంటినిండా అడ్డుంచుకోవలసిన పరిస్థితి కలిగింది.

వాన వెలిసిన ఉదయం చేనివద్ద కెళ్ళాను-ఎట్లుందో చూద్దామని, వీలైతే తేమతోనే చెట్టు పీకుదామని.

చేనికేసి చూసి నిర్వీర్యుణ్ణయ్యాను.

చెట్టు కనిపించలేదు అసలు. చేనంతా నల్లగా ఉంది. ఆకులన్నీ కుళ్ళిపోయి నేలకు అంటుకొని ఉన్నాయి. ఎండి గలగలమంటోన్న శెనక్కాట్టె వారం రోజులు తడవటం వల్ల పాచిపోయింది.

ఒక చెట్టు పీకి అదిరిపడ్డాను.

కాయల్ని భూమిలోనే వదలి కుళ్ళిన ఉండలతో అస్థిపంజరంలా బైటకొచ్చింది అది.

గట్టుమీద అలాగే కూలబడ్డాను.

'కనీసం గొడ్డు మేత కూడా దక్కకుండా పోయింది ఈ పాపిష్టి వానతో.'

ఒక్కరోజు కురిసి పొయ్యుంటే రైతులు బాగుపడేవాళ్ళు.

నాన్న చెబుతూంటాడు 'ఏడు కరవులొచ్చినా రైతు సేద్యం చాలించ'దని.

నన్నీ ఒక్క కరవే ఊర్నించి పారిపోయేలా చేస్తోంది. కూలిపని చేసుకునైనా పూట గడుపుకొమ్మని చెబుతోంది.